"వాళ్ళు ధనవంతులు వాళ్ళు అదృష్టవంతులు కాబట్టి, గొప్పోళ్ళలో పుట్టి కులుకుతున్నారు. మనం పేదవాళ్ళం మనం చేసుకున్న కర్మగాబట్టి దరిద్రాన్ననుభవిస్తున్నాం" ఈ విధమైన సంఘర్షణ ఏనాడో వాళ్ళ నిత్యజీవితంలో మొద్దుబారినవి.

ఆవేళసంక్రాంతి.చెప్పనలనికాని వైభవోపేతంగా వుంది ధనవంతులవీధి...చెప్పనలవిగాని దుర్భర హీనస్థితిలోవుంది బీదలవీధి...పండుగలు వస్తుంటాయి, పోతాయి. వాటిఫలితాలూ వాటి ఆనందాలూ ధనవంతులకే! బీదలకు ఆ పండుగ నిత్యజీవితంలో, నిరాడంబరమైన రోజు ధనవంతులకు ఆడంబరమైన రోజు.

రామిగాడి కుటుంబంలో ఆవేళ యే కొత్తదనమూ లేదు: గుడిసెలో కుక్కినులకమంచంమీద మేనువాల్చి ఎదురుగా ధనవంతుల మేడల అంతస్థుల్లో ఎలక్ట్రిక్ దీపాల కాంతిలో వెలిగిపోతున్న ధనవంతుల కులుకులు, విలాసాలు, చుట్టపొగనుంచి అరమోడ్పు కళ్ళతో చూస్తూ, తన జన్మ నిరర్థకమైందని నిందించుకున్నాడు. అంతస్థుల్లోంచి నేరుగావచ్చి, రామిగాడి చెవుల్లో ప్రవేశిస్తున్న రేడియోగానానికి రామిగాడు కళ్ళు మూసాడు.

తెలివి వచ్చింది. ఠాణాలో గంటలు రెండు కొట్టారు-వాడు అలాగే పడివున్నాడు. వాడి గుడిసెకు ద్వారంలేదు. తలపైకెత్తిచూచాడు.విద్యుద్దీపాలకాంతి తగ్గింది. ధనవంతుల యిళ్లు తలుపులు వేసివున్నాయి.

నిద్రమైకంలో రామిగాడికి మానవాతీతులైన కొందరు దేవతాస్త్రీలు ఒక భాగ్యవంతుని మేడ మెట్లు ఎక్కుతున్నట్లు కన్పించారు. వాళ్ళ ముఖాలు స్పష్టంగాలేగావుని, శరీరాలు కాంతివంతంగా వున్నాయి. దేవతలు లోపలకు వెళ్ళి తిరిగివస్తున్నారు. మూసిన తలుపులు వాళ్ళని అడ్డలేదు. వాళ్ళు మరొక భాగ్యవంతుని యింటికి మరలే స్థితిలో వున్నారు. రామిగాడు. తన శనివిరగడౌతుందని వాళ్ళను ఎలుగెత్తి పిలిచాడు—"ఓ దేవతల్లారా! మా గుడిసెలు పావనంచెయ్యండి-మమ్ములను పావనం చెయ్యండి" అని అరచాడు.

"అసంభవం" అన్నారు దేవతలు.

రామిగాడు వళ్ళు చూచుకున్నాడు. చింకిచొక్కా- కుక్కిమంచం - కునికే దీపబుడ్డీ - వాయుదేవుడు తనశక్తిని చూపించాడు. కునికే నక్కమీద పడిన తాటిపండులా ఆరి, దీపం ఆరినవాసన వేసింది. ఇప్పుడు మరీ స్పష్టంగా కన్పిస్తున్నారు దేవతలు. ఎలుగెత్తి అరిచాడు రామిగాడు. దూరంనుంచే దండాలు పెట్టాడు. వాళ్ళను అక్కడకు రమ్మనికోరాడు. "మేము సంక్రాంతి దేవతలం—అదృష్టదేవతలం...మీకా అదృష్టంలేదు. మేము అక్కడ అడుగు పెట్టం" అన్నారు దేవతలు. రామిగాడు గోలవదల్లేదు.

దేవతలు యేమి ఆలోచించారో యేమో! చరచరా వచ్చారు. దేదీప్యమానమైన కాంతిలో గుడిసెముందు నిలబడ్డారు. వారి ఆభరణాలు వారి దుస్తులూ కళ్ళు మిరిమిట్లు గొలిపే కాంతిని ప్రసరింప జేస్తున్నాయి రామిగాడి కళ్ళకు. ఆప్యాయంగా సంబరపడుతూ ఆహ్వానించాడు రామిగాడు దేవతలను తన గుడిసెలోనికి. కాని కాని, ఆశ్చర్యం వాళ్ళ దేదీప్తమైన కాంతి పోయింది. వారి ఆభరణాలు కగ్గిపోయాయి. వాళ్ళబట్టలు చింకివిగా కన్పించసాగేయి. వాళ్ళ ముఖాలు వికృతంగా మారిపోతున్నాయి. రామిగాడు ఆశ్చర్యపోతున్నాడు. వారివల్ల తనకు అదృష్టం పడుతుందనుకున్నాడు కాని రామిగాడిదశ, గుడిసెలో అడుగుపెట్టిన దేవతలకు పట్టింది. క్షణక్షణానికి వికృతరూపంగా మారిపోతున్న దేవతల్ని చూచి, రామిగాడు కేకలేస్తూ మంచం మీదనుండి క్రింద పడ్డాడు. లేచి చుట్టూ చూచాడు. దేవతల్లేరు. ఎదురుగా చూచాడు. పూర్వపు కాంతులతో భాగ్యవంతుల యిళ్ళలోకి అప్పుడప్పుడే అదృశ్యమైనట్లు కన్పించసాగారు ఆ అమాయకునికి.

---

నగలదుకాణం చూస్తూ "ఆ చక్కని గాజుల జత నా చేతులకి బాగుంటాయి కదూ"అంది నూత్న వధువు. "అవును కాని అవి కొనే స్తోమతు నాకు లేదు"అన్నాడు భర్త. "పోనీ వుంటే కొనేవారేకదూ?" అంది అమ్మాయి. "అబ్బే! అప్పుడు యింత చవకవి మనకెందుకు!"అన్నాడు భర్త.

స్కెచ్

# రానురాను లోకజ్ఞానం!

వేమూరి సుబ్రహ్మణ్యం

ఆధునిక కాలంలో అత్తవారింట్లో జరుగాల్సిన గౌరవ మర్యాదలను సంపూర్ణంగా అనుభవించి వాళ్ళింకా రెండురోజులుండమని ఎంత బ్రతిమిలాడినా వినక స్టేషన్‌కు బయలుదేరాను మా మూడవ బావమరిదితో. నిజానికి అక్కడ నేను ఉన్న మూడురోజులు ఎట్లా గడిచిపోయినాయో నాకే తెలియలేదు. నన్నొక రాజకుమారుడిలాగా గౌరవించారు. లడ్డులైనా తినగా తినగా వెగటు పుట్టిస్తయ్. అలాగ వుండమన్నారు గదా అని ఇంకోవారం రోజులు వాళ్ళింట్లోవుంటే ఏం జరుగుతుందో నాకు బాగా తెలుసు! అందుకనే బెట్టు నిలుపుకోవాలని ఇంటికి బయలుదేరాను.

నన్ను రైలెక్కించటానికి మూడవ బావమరిది స్టేషనుకు నాతో వచ్చాడు. టికెట్టు తీసుకుని ఖాళీగావున్న కంపార్టుమెంటులో ఒకమూల నా పెట్టెపెట్టి, నేనూ మా బావమరిది ప్లాట్‌ఫారం మీద వొచ్చి నిల్చున్నాం కబుర్లు చెప్పుకుంటూ. ఇంతలో మాపక్కనించి ఇద్దరు ఏదో పెద్దగా మాట్లాడుకుంటూ వెడుతున్నారు.

"భారతీయ మొదటి గవర్నర్ జనరల్ జవహర్‌లాల్ నెహ్రూ అయితే, మహాత్మాగాంధీ అని దబాయిస్తావేమిటి?" అంటున్నాడు వాళ్ళిద్దరిలో ఒకడు.

"నీ మొహం! మొదటి ప్రధాని నెహ్రూ. గవర్నర్ జనరల్ మాత్రం గాంధీ!" అంటున్నాడు రెండోవాడు.

"నీకు భలే తెలుసులే! అసలు గాంధీ పదవి ఏదీ తీసుకోనన్నాడు."

"అవును, గాని బతిమలాడి ఒప్పించారు!"

ఇలా వాదించుకొంటూ వెళ్ళారు వాళ్ళిద్దరూ!

వాళ్ళను చూస్తే నాకే ఆశ్చర్యం వేసింది. వులెన్ పాంటులో సిల్కు షర్టుదోపి ఒకడు; సిల్కు పేంటు, ఖరీదయిన గుడ్డతో కుట్టించిన బుష్‌కోటు వేసుకొని మరొకడునూ! చూస్తే కాలేజీ స్టూడెంట్సులాగా కనబడుతున్నారు. వాళ్ళ ప్రపంచజ్ఞానం ఇదీ!

"విన్నావుగా, మరి నువ్వు చెప్పు మొదటి భారతీయ గవర్నర్ జనరల్ ఎవరో?" అన్నాను మా బావమరిదితో నవ్వుతూ.

"ఎవరంటావా?...ఎవరా!..." అని కాసేపు తికమకపడి "ఎవరైతే మనకెందుకు పోనిద్దూ" అని తాక్యంగా అన్నాడు.

"అదేమిటోయ్! టీచర్ ట్రెయినింగ్ కూడా ప్యాసయ్యావు, మరి రేపు పిల్లలకు చదువెలా చెబుతావ్?" అన్నాను ఆశ్చర్యంతో.

"పిల్లలకు చదువు చెప్పటానికి, మొదటి భారతీయ గవర్నర్ జనరల్ ఎవరూ? బ్రిటన్‌కు పదేళ్ళ కిందట వ్యవసాయమంత్రి ఎవరూ? నెహ్రూ అల్లుడికి ఉద్యోగం ఏమిటి? ఇవన్నీ తెలియాలేమిటి?" అన్నాడు తిరిగి నవ్వుతూ.

ఇంతలో గార్డు విజిల్ వేశాడు. ఇంజన్ కూత కూసింది. నేను రైలెక్కాను. నాకు షేక్ హేండ్ ఇచ్చి, "నాన్నగారిని అమ్మగారిని అడిగానని చెప్పు బావా, పోగానే ఉత్తరం రాస్తావుగదూ, అశ్రద్ధ చెయ్యొద్దు" అన్నాడు బావమరిది. బండి కదిలింది. "అలాగేలే" అని చెప్పి లోపలికెళ్ళి నా సీటులో కూర్చున్నాను. సగం చదువుతూ ఆపివేసిన, నెహ్రూ రాసిన "గ్లింప్సెస్ ఆఫ్ వర్ల్డ్ హిస్టరీ" తీసి చదవటం మొదలెట్టాను. చదువుతుంటే, బండిలో ఉన్నానో, ఇంట్లో ఉన్నానో, ఎక్కడున్నానో నాకే జ్ఞాపకం లేకపోయింది. ఎంతకాలం గడిచిందో నాకు తెలియదు.

"తగ్గవోయ్, "డాక్టర్స్ డైలమా" రాసింది పెరల్‌బక్, అంతేకాని డికెన్స్ కాదు" అన్న అరుపుతో ఉలిక్కిపడి పుస్తకం ప్రపంచంలోంచి రైల్లో పడ్డాను. నా సీటు కెదురుగా ఇద్దరు స్టూడెంట్సు

కాబోలు కూర్చున్నారు. ఇద్దరికీ కళ్ళజోడు లున్నాయ్! ఇద్దరూ చొక్కాలు పాంటులలో దూర్చారు. అందులో ఒకడు అరిచిన అరుపే నన్ను రైలులోకి తీసుకువచ్చి పడేసింది "గ్లింప్సెస్ ఆఫ్ వరల్డు హిస్టరీ" లోంచి.

"సంతోషించారులే మయ్యావోయ్! డాక్టర్స్ డైలమా" రాసింది చార్లస్ డికెన్స్. పెరల్ బక్ మాత్రంగాదు. అసలు పెరల్ బక్ 'స్టైల్' వేరు. వాడిలాంటి పుస్తకాలు రాయడు!"

"డెఫెనెట్‌గా పెరల్ బక్ రాశాడీపుస్తకం."

వాళ్ళ జనరల్ నాలెడ్జి చూసి వేసింది నాకు. వాళ్ళను పలకరించటానికి కూడా మనస్కరించక మళ్ళీ పుస్తకం చదువుకోవటం ప్రారంభించాను.

మళ్ళీ ఎంతకాలం గడిచిందో తెలియదు. వాళ్ళలో ఒకడు నన్ను తట్టి "ఎమండీఐసెన్ హోవర్ ఇండియాలో బ్రిటన్ రాయబారికాదూ" అన్నాడు. నేను వాడివైపు వింతగా చూశాను.

"చూడండి వాడితెలివి! ఐసెన్‌హోవరు బ్రిటిష్ ప్రధానికాదూ?" అన్నాడు రెండోవాడు.

నేను నవ్వుతూ "సారీ! మీరు పొరపాటు పడ్డారండీ! ఐసెన్‌హోవరో చైనా ప్రెసిడెంటు!" అన్నాను.

అమాంతంగా ఇద్దరూ కక్కసారిగా "అయామ్ సారీ" అన్నారు.

నేనూరుకోలేక "ఏంచేస్తున్నారండీ మీరిద్దరూ?" అన్నాను.

"సెకండ్ ఇయర్ ఆనర్స్ ఫిలాసఫీ"అన్నాడు ఒకడు.

"కాలేజీలు తెరిచారుగాదండి, అందుకని వెడుతున్నాం"అన్నాడు రెండోవాడు.

నేను తెల్లబోయాను.

ఇంతలో తెలాలి రావటంతో ఆనాటి అనుభవానికి ఆశ్చర్యపోతూ దిగిపోయాను.

---

అతిథిపూజలో రకరకాలు

# మర్యాదలు

## యిరగవరపు సుబ్బారావు

మన నిత్యజీవితంలో మర్యాద చేయడం, చేయించుకోవడం అనేక తరహాలగా యుంటుంది. కొందఱు మర్యాదకోసం కొంప గుల్ల చేసుకోవడంకూడ చూస్తున్నాం. అణా ఖర్చులేకుండా ఘనమైన మర్యాద చేసేవాళ్ళని చూస్తున్నాం. ఈ మర్యాద చెయ్యడంలో అనేక రకములు. అనేక విధములు.

నేనొకనాడు బజారువెంట నడుస్తున్నాను. ఎంత మండిపోతున్నది. వేడి ఘాళుపు ఈ చివర నుండి ఆ చివరకి కొడ్తోంది. అపరిమితమైన దాహం అవుతోంది. పద్మనాభం కిళ్ళీకొట్టు కనబడింది. నన్ను చూసి, "రండి పంతులుగారు, ఒకేయి, కుర్రాడా, పంతులుగార్కి తొట్టిలోవున్న ఐస్‌సోడా కొట్టూ" అన్నాడు పంతులుగారికోసం తొట్టిలో పెట్టినట్లుగా. ఈ వేడి ఘాళుపులవల్ల సోడా కాయలు పగిలిపోకుండా వుండేందుకు నీళ్ళతొట్టిలో పెట్టినప్పటికినీ, ఈ పంతులుగారు తనకోసమే ప్రత్యేకంగా, గౌరవముతో తొట్టిలోంచి సోడాతీసి యిచ్చాడని తబ్బుబ్బయి, పద్మనాభం యిచ్చే మర్యాదకోసం సోడాలు అక్కడే తీసుకుంటాను. ఈవిధమైన మర్యాదకు అణాకాసు ఖర్చుపెట్టనవసరము లేకపోయినా బిజినెస్ ఇంప్రూవ్ అవుతుంది.

ఒకసారి కామేశ్వర్రావు హోటలులో భోజనము చెయ్యవలసి వచ్చింది. ఎందుకంటే సెప్టెంబలో ఇంగ్లీషుకు కూర్చున్నానుగా — అందుకని కామేశ్వర్రావు హోటల్‌కు పోయి, మూడు రోజులుంటాను. మీాల్సు ప్రిపరేషన్, నెయ్యీ అదీ బాగుంటుందా అని అడిగాను.

"అది నేను వేరే చెప్పాలా, మీారే చూస్తురుగా, రండి భోజనం చెయ్యండి" అన్నాడు.